


# దేవుడి పెళ్ళి

ఎమ్. రాజగోపాలరావు

ఎక్కడో టముకు వినిపడింది. యేదో విశేషముందని అందరూ చెవులు రిక్కించుకొని విన్నారు — "దేవుడి పెళ్లి విషయం మాట్లాడటానికి మాయిటిపూటందరూ దేవుడి గుడిముందు జేరాలిసందోహో"— ఈ వార్త అన్ని బజారులకూ చేరింది.

పల్లెల్లో నాగరికత ఎంతగానో ముదిరి తెల్ల కంకులు వేసింది. పంచెలుపోయి లుంగీలు వచ్చాయి. అరకలకంటే ముందు గొడుగులు, ఫ్లాస్కులు పొలాలు పోతున్నాయి. చుట్టను మటుబెట్టి సిగరెట్ రాజ్యమేలుతోంది. నీరుకావిని నీటముంచి ఇస్త్రీ బట్టలు పీఠం వేశాయి. పాత పెత్తందారీపోయి పంచాయతీ వచ్చింది. అయినా టముకుపద్ధతి అంటి పెట్టుకొనే ఉంది. గ్రామ పెద్దలలో — అంటే మునసబు, కరణము, సర్పంచ్, ట్రస్టీలు వగయిరాల బుద్ధిలో ఏదో ఒక పురుగు తొలిచినప్పుడు ఆ పురుగును అందరి బుర్రల్లోకీ ఎక్కించి ఆ బాధ్యతల్ని అందరి నెత్తిమీద రుద్ది తమ కనుకూలంగా కూడగట్టు కోటానికి టముకు పద్ధతి చాలా అనుకూలంగా ఉండటంతో అదింకా బ్రతికే ఉంది కొత్తకొత్త బట్టలు గడుతోంది.

దేవుడి పెళ్ళికి అందరూ పెద్దలే. చిన్నా పెద్దా, బీదా బిక్కా అందరూ పెండలాడే అన్నాలుతిని నానారకాల పోగవత్తులు ఊసు కొంటూ, జరగబోయే తంతు నూహించు కొంటూ దేవాలయం ముందు చేరారు. రావలసిన వారంతా కొంచెం వెనకా ముందుగా చేరటంతో రచ్చలో ఉత్సాహం రేగింది.

పెద్దలెప్పుడూ సూటిగా రంగంలోకి దిగకపోవటం పల్లెల్లో రివాజు. రాబోయే రోజుల్లో కాబోయే పెద్దల మనుకునేవారిని కొందరిని చేతికింద పెట్టుకుని తోలుబొమ్మ లాగా ఆడిస్తూ వారి నోటిద్వారా తమ మంత్రాంగం వెల్లడించటం బహిరంగ రహస్యం. ఆ నేపథ్య వ్యవహార మందరికీ తెలిసిందే. అయినా ఎవరూ పట్టించుకోరు— కనీసం పట్టించుకొనట్లు కనపడకారు. నేపథ్య స్వరానికి— దాని మూల మంత్రాంగానికి— ఆధారమైన స్వార్థానికి కోరున్న వారందరికీ ఏదో ఒక చుట్టరిక ముంటుంది. తీగె లాగితే డొంకంతా కదులు తుందని ఆషాక్ కొట్టే తీగెనెవరూ అంటుకోరు.

మండే వేసవి. సాయంత్రానికి ఎండ తగ్గినా ఉక్క పూర్తిగా తగ్గలేదు. అప్పుడే పైరగాలి ప్రారంభించి పగటి ఆవిరిని హతమారుస్తున్నది. చందమామ విందారా వెన్నెల కురుస్తున్నది. సూర్యుని తీక్షతలో పుటంబెటిన ఆలోచనలు చంద్రుని వెన్నెలలో రెక్కలు విప్పుకొంటాయి. ఆలోచనల భారంతో కొందరు, అరుబయట గాలికి కొందరు, ఆ ప్రహసనాన్ని చూసి ఆనందించటానికి కొందరు — అందరూ అక్కడ చేరారు.

ప్రారంభించవచ్చుననటానికి గుర్తుగా సర్పంచ్ సకిలించటంతో అంకయ్య గొంతు విప్పాడు. సర్పంచ్ మంత్రాంగాన్ని మాటలలోకి మార్చే యంత్రం అంకయ్య. జరగబోయే పంచాయితీ ఎన్నికల్లో దొరకబోయే పదవి అనే 'కీ'తో అంకయ్య గొంతును కంట్రోల్ జేస్తున్నాడు సర్పంచ్. అంతకంటె గట్టిగానే సుబ్బయ్య గొంతు బిగించాడు మునసబు. "మిగులుభూమి" అనే ఎరచుట్టూ చేపపిల్లలా కళ్ళు మూసుకు తిరుగుతున్నాడు సుబ్బయ్య. అందుకే అంకయ్య గొంతుకు సుబ్బయ్య కంఠమడ్డుపడుతూ వుంటుంది.

ప్రతి సంవత్సరం జరుగుతున్నట్లుగానే ఈ సంవత్సరం కూడా పండక్కి దేవుడి పెళ్ళి జరిగించాలని పెద్దలంతా భావిస్తున్నారనీ, దానికి అందరూ అన్నివిధాలా సహాయం చేయవలసి వుందని అంకయ్య ఆత్మఘోష. ఎప్పుడూ ఒకే దేవుడి పెళ్లి చేయటం పక్షపాతమేకాక అపచారమనీ, అందువల్లనే అనేక అనర్థాలు గ్రామాన్ని చుట్టుముట్టాయనీ అందువల్ల ఇద్దరి దేవుళ్ళకూ పెళ్ళి చేయాలని సుబ్బయ్య దైవఘోష

ఇక్కడొక విషయం గమనించాలి. మతవైషమ్యాలను మట్టుబెట్టి దైవభక్తిని పెంచే దృష్టితోనేమో ఆ గ్రామానికి నడిబొడ్డున శివుని ఆలయాన్నీ, విష్ణువు ఆలయాన్నీ ఒకే ప్రహరీలో బిగించివేశారు మహాత్ములు. పూజా పునస్కారాలు, సంతర్పణలూ సమారాధనలూ జరగటానికి మడి మాన్యాలనుకూడా వారే ఏర్పాటు జేశారు. ఆ మాన్యాలద్వారా వచ్చే రాబడిని

# జ్వలిత చేతన

తాబేలు డిప్పలాంటి ఇల్లు
కీళ్లు కొంకర్లుపోయిన గది.
ఆవులించే మేజాబల్ల.
అడపాదడపా కుక్కపిల్లలా
కుయికుయ్యమనే కుర్చీ.
కుర్చీలో అతుక్కుపోయిన మేధావి
కొండచరియల్లో ఇరుక్కుపోయిన
సంజీవి
వచ్చేయ్ ఊబిలోనుంచి.
చుట్టూ పుట్టలా పెరిగిన సమాధి
నుంచి.

గదిలో పాతుకుపోయిన వేళ్లు
కవిత్వాన్ని సృష్టించలేవు.
నేలలో దిగబడ్డ కాళ్ళు
నింగి అంచుల్ని స్పృశించలేవు.
తలకాయనుంచి బయటపడలేక
వెనక్కి తిరిగిపోయే చూపులు
విశ్వం పొరల్ని విశ్లేషించలేవు.
భయాల మంచుగడ్డల మాటున
పిడచగట్టిన ఆలోచనలు
సూర్యుని కనురెప్పల్ని చుంబించ
లేవు.
వేళ్ళు కదలాలి కొరడాల్లాగ.
కాళ్ళు ఉరకాలి కిరణాల్లాగ.
చూపులు సాగాలి దావాగ్నుల్లాగ.
ఆలోచనలు మోగాలి శతఘ్నుల్లాగ
మనిషికి మనుగడ జ్వలిత చేతన.
జగతికి నిలకడ భావి చింతన.

— డాక్టర్ సి. నారాయణరెడ్డి

---




# దేవుడి పెళ్ళి

కైంకర్యం చేయటానికి ప్రత్యర్థుల భక్తి అప్పుడప్పుడూ పెరిగిపోతూ ఉంటుందని గిట్టని వారంటారు ఇద్దరి దేవుళ్ళమీది అజమాయిషీని గ్రామంలోని రెండు వర్గాలు పంచుకొని చక్కగా సహజీవనం సాగిస్తున్నా ఎన్నికలముందు ఎత్తే కొత్త ఎత్తుగడలకు అవతల పార్టీ చిత్తుగాకుండా ఎదురెతులు వేసినప్పుడు కథ అడ్డం తిరుగుతూ ఉంటుంది.

శివుడికి పెళ్ళిచేసే ఆచారమెప్పుడూ లేదనీ, అటువంటి అనాచారాలు ప్రారంభిస్తే అనర్థకాలు చుట్టుకొంటాయని అంకయ్య వాదించటం సర్పంచ్ శ్రుతి గల్పటంతో ఆ వర్గమంతా కోరస్ పాడింది.

ఆచారాలు మన మేర్పరచుకొన్నవేననీ. గ్రామ ప్రజలందరికీ ఇష్టమైన ఆచారమే సదాచారమనీ, అవసరమయినప్పుడు కొత్త బాటలు తొక్కవలసి ఉంటుందనీ సుబ్బయ్యగొంతు శ్రుతి పెంచటం. మునసబు గొంతు జతకావటంతో ఆయన వర్గమంతా తాళం వేసింది.

దానితో అనేక గొంతులు అందుకోవటం – అపశ్రుతులు పలకటం – పార్టీలు విడిపోవటం – పాత పురాణాలు బయటకు రావటం – అమ్మలను, అక్కలను, పెళ్ళాలను నగ్నంగా ప్రశంసించుకోవటం వంటి సామాన్య సంగీతమంతా స్వైర విహారం చేసింది.

కథ రసకందాయంలో పడిందనీ అంతకు మించితే చేతులు కలిసి, అవి కూడా దాటిపోయే ప్రమాదమేర్పడిందనీ గ్రహించిన కరణం కలిగించుకొని ఉభయులకూ అంగీకారమవుతుందనుకొన్న తీర్పు చెప్పాడు.

దేవుళ్ళందరూ ఒకే శక్తికి భిన్న రూపాలు అట్లాగే వారి భార్యలు కూడా ఒకే శక్తిస్వరూపిణులు. వారందరూ నామ రూపాలకు భిన్నమైన . అతీతులు. అందువల్ల ద్వేషాలు పరిత్యజించి సత్యాన్ని గ్రహించి విష్ణువుకూ పార్వతికీ పెళ్ళి చేస్తే రెండు దేవాలయాలనూ గౌరవించినట్లే అవుతుంది ఇద్దరు ప్రత్యర్థుల ప్రసాదాలనూ పానకాలనూ. కలిపి పంచితే రెండు ప్రసాదాలూ అందినట్లే అవుతుంది.

ఆ బ్రహ్మాండమైన బుర్రకు తోచిన ఈ అఖండమైన ఆలోచనకు పొంగిపోయి. 'సెభాస్' అని మెచ్చుకొని అందరూ కరణాన్ని వేనోళ్ళ కొనియాడారు ఆనందంగా ఇళ్ళకు చేరారు.

అంతా సవ్యంగా జరిగిపోతుందనుకొన్న పల్లె ప్రజలకు తెల్లవారేసరికే ఇంకో సమస్య తయారయి కూర్చుంది.

సంప్రదాయికంగా మునసబుగారి ప్రసాదం ముందు దేవాలయం ప్రవేశించటం. అందరూ వారి ననుసరించటం జరుగుతుండేది ఈమధ్య పంచాయతీవచ్చి గ్రామ పెత్తనం సర్పంచ్‌కి దక్కటంతో ప్రథమ స్థానం తన ప్రసాదానికే రావాలని ఆయన పట్టుబట్టాడు. ఆ సమస్యను పరిష్కరించటానికిగాను ఆ గ్రామ మేధావులు అతి గాఢంగా ఆలోచించి దేవాలయాల ప్రహరీకి రెండు గేట్లు పెట్టించి ఇద్దరికీ ఒకేసారి ప్రవేశం కలిగించి ఇద్దరినీ సంతృప్తిపరచి పునీతులయ్యారు. ఎవరి దేవుడు వారికున్నాడు కనక ఎవరి పూజారి వారి సాహ్యానిస్తాడు కనక హెచ్చుతగ్గుల భేదం లేకుండా ఆ సమస్య పరిష్కారమయిపోయింది.

ప్రస్తుతం "సంఘటిత పెళ్ళి" జరిగించాలనుకొనేటప్పటికి వ్యవహారం మళ్ళీ మొదటికొచ్చింది. ఇద్దరూ ఆ అవకాశం తనకే కావాలని పట్టుబట్టి కూర్చున్నారు. సాగిన రాయబారాలు సగంలోనే ఆగిపోయాయి. ప్రజలలో ఆరాటం పెరిగిపోతూ వుంది

దీనితో విసిగిపోయిన యువతరం ముందుకుదూకి వాళ్ళిద్దరూ తప్పుకోవాలనీ, ఆ దైవకార్యాన్ని ప్రజల తరపున తామే నిర్వహిస్తామనీ ప్రతిపాదించారు.

అన్ని ఓట్లను కాలదన్నుకొనే ధైర్యం ఏ వర్గానికీలేదు. సర్పంచే వీళ్ళందరికీ పురెక్కించాడని మునసబు. మునసబే వీళ్ళను ఎగదోశాడని సర్పంచీ బజారున బడి దుయ్యబట్టుకొని ఇద్దరూ చేతులు

కలపటంకంటే విడిగా ఉండటమే మేలని నిరయించుకొన్నారు. ఇద్దరూ యువతరాన్ని ఆకాశానికె త్తేశారు.

అదే అదననుకొన్న యువతరం తమ ప్రత్యేకతను చూపించే సమయం చిక్కినందుకు సంతోషించింది. ఒక సంఘంగా ఏర్పడి చందాలు పోగుచేసి కార్యక్రమాలు నిర్ణయించి కావలసిన ఏర్పాట్లన్నీ ఘనంగా చేయటం మొదలెట్టింది.

మునసబుగారి పూజారి ఆయనకే ప్రదక్షిణలు చేయటం "సర్పంచ్‌గారి పూజారి ఆయనకే ఉపగ్రహం కావటం" పూజారులిద్దరూ వీళ్ళను పట్టించుకోకపోవటం— రెండు వర్గాల పెద్దలూ సహకరించకపోవటం కొంత కష్టమనిపించినా దొరికిన అమూల్యమైన అవకాశాన్ని యువతరం సద్వినియోగం చేసుకొంది.

పండగ దగ్గరబడే కొద్దీ పల్లెలో హడావిడి పెరిగింది. పందిళ్ళు లేచాయి. రంగు కాయితాలు పందిళ్ళెక్కాయి. ఆలయాలకు సున్నాలు గొట్టం, కలశాలకు మెరుగులు బెటటం దేవుళ్ళకు దేహశుద్ధి గావించటం అన్నీ చకచకా జరిగిపోయాయి. వారి కార్యదీక్షకు గ్రామమంతా అబ్బురపడిపోయింది.

ఆ రోజూ రానే వచ్చింది. హడావిడి హెచ్చింది. పల్లెలో ముందుగానే తెల్లవారింది. హరి దాసు మందీ మార్బలంతో దిగాడు. బస్తీ నుంచి తెచ్చిన మైక్ నిర్విరామంగా పాటలు పాడుతూ అందరిని మేల్కొల్పింది.

ఎండ వచ్చేటప్పటికి పానకం వడపప్పులు తయారయిపోయాయి. పిల్లాజెల్లా, బీదా బిక్కీ అందరూ పందిరినిండాజేరి సందడి జేయటంతో యువతరంలో ఉరుకులు పరుగులు హెచ్చి, చెమటలు గక్కి ఉక్కిరి బిక్కిరయిపోయింది,

అంతా సిద్ధమయిపోయింది. అందరూ సన్నద్ధమయారు. బాజా భజంత్రీలు మ్రోగాయి. వేదఘోషలు రేగాయి. ఆ పవిత్ర వాతావరణంలో భగవంతుని తరపున పూజారి అమ్మవారి మెడలో మంగళసూత్రమలంకరించాడు. మంగళవాద్యాలు మిన్నుముట్టాయి. అందరూ ఆనందంగా అక్షింతలు చల్లారు. పార్వతీ, విష్ణువులు భార్యా భర్తలు కావటం ఆకాశంనుంచి చూసిన దేవతలు ఆనంద బాష్పాలు రాల్చినట్లుగా బొటబొటా నాలుగు చినుకులు పడ్డాయి.

ఇక మిగిలిందల్లా ప్రసాదం పంచటమే పానకం కోసం చెంబులూ, ప్రసాదం కోసం ఆకులూ సిద్ధం చేసుకొని అందరూ ఆత్రంగా ఎదురుచూస్తున్నారు.

పూజారులిద్దరూ సాగి పవిత్ర మంత్రాల మధ్య కొంత వడపప్పు వెండి పళ్ళాల్లో తీసుకొని, కొంత పానకం వెండి బిందెల్లో పోసుకొని వారి వారి దేవాలయాలలోకి వెళ్ళి వారి వారి దేవతల కర్పించి తిసుక వచ్చారు.

ఆ పవిత్ర ప్రసాదాన్నందుకొని తక్కిన వాటితో కలిపి దానికోసమే గుటకలు మింగుతూ ఎదురుచూస్తున్న పాటక జనానికి పంచిపెటటం ప్రారంభించింది యువతరం.

అందరూ ప్రసాదం కోసం ఎగబడటం, అందినవారు వెళ్ళాలని చూడటం, అందని వారు ముందుకు తోసుకు రావటం పంచుతున్న యువతరం హడావిడి, కేకలు, పిల్లల కేరింతాలు, పెద్దల మందలింపులు, చెంబుల కుమ్ములాటలు - అంతా గందరగోళంగా ఉంది.

ముందు అందినవారు ప్రసాదం తిని పానకం తాగారు. అందనివారు అందుకుంటున్నారు.

అంతలో ... హడావిడి ఆగిపోయింది. ఎక్కడివాళ్ళక్కడ వాలిపోతున్నారు. ఏడుపులు పెడబొబ్బలు మొదలయినవి. ఏమిటా అని చూసిన యువతరం అవాక్కయి కదలలేకపోయింది.

ప్రసాదం తిన్నవాళ్ళు మెలికలు తిరిగి పడిపోతున్నారు నోటివెంట నొంగ గారుతున్నది. అంతా బీభత్సమయిపోయింది. పెళ్ళి పందిరి క్షణంలో శ్మశాన వాటికలా కనబడింది. పల్లె అల్లకల్లోలమయింది.

తేరుకున్న యువతరం డాక్టరుకోసం పరిగెత్తింది.

మునసబు మీసాలు మరింత పైకి లేచాయి. సర్పంచ్ నామాలు పొడవు సాగాయి, ఆ ఉపద్రవానికి కారణం కనుక్కోవటానికి ఇద్దరూ దేవాలయం దగ్గరకి బలగంతో సహా చేరారు.

సూర్య భగవానుడు నిప్పులు చెరుగుతున్నా ...

★



# గాథావళి — 356

## వైట్ హౌస్ - వాయిద్యకారుడు

దేశంలోని ఒక పెద్ద రాజకీయ పార్టీ ప్రచారానికి వాయిద్యకారుడుగా పనిచేసిన వ్యక్తి ఆ దేశానికే అధ్యక్షుడు అవుతాడని అప్పట్లో ఎవ్వరూ ఊహించి ఉండరు. 1920సం॥లో అమెరికా 29వ అధ్యక్ష పదవి అలంకరించిన వ్యక్తి అయిన "వారెన్ గమాలియార్ హార్డింగ్ ప్యాంట్" ఇంగ్లీషు దంపతుల కుటుంబంలో పిహాడు. అతని బాల్యం అంతా పేదరికంతోనే గ్రామజీవిగానే గడిచింది. వారెన్ కాలేజి విడిచిన తరువాత పొలం కూలీగా, రెయిల్ రోడ్ శ్రామికుడుగా, వార్తాపత్రికల ముద్రాపకుడుగా, అమ్మేవాడుగా కృషిచేశాడు. అమెరికాలోని ఒక పెద్ద పార్టీయైన "రిపబ్లికన్" పార్టీ ప్రచారాల ఊరేగింపులో వాయిద్యకారుడుగా రాజకీయాల్లో ప్రవేశించి, అదృష్ట అవకాశంతో ఆ పార్టీ ద్వారానే అమెరికా అధ్యక్షుడైనాడు వారెన్.

హార్డింగ్ "ఉడ్రోవిల్సన్"నుంచి అధ్యక్ష పదవి స్వీకరించిన నాటినుంచే అతను నైతికంగా పతనం కాజొచ్చాడు. ప్రభుత్వ వ్యవహారాన్ని అతని సహచరులైన మంత్రులకు వదిలి విలాస జీవితం గడపజొచ్చాడు. వైట్‌హౌస్‌ను అత్యుత్తమ శ్రేణికి చెందిన కాఫీహోటల్, క్లబ్‌గా మార్చాడు. జల్సారాయుడయ్యాడు. అతని పతనానికి అతని భార్య అయిన ఫ్లారెన్స్ ఎంతగానో ఉపయోగపడింది. ఫ్లారెన్స్‌కు వారెన్ రెండవ భర్త. ఆమె ఒక రాణిగా పెత్తనం చలాయించింది. వారెన్ వైట్‌హౌస్‌ను అపఖ్యాతిపాలు చేసినవాడుగా, అసమర్థుడైన అధ్యక్షుడుగా గుర్తించబడినాడు హార్డింగ్ అధ్యక్షుడుగా తన అసమర్థతను ఒప్పుకొనుటలో నిజాయితీ చూపించాడు. 1923వ సంవత్సరం ఆరంభములో పరిస్థితులు వక్రించినవి. చెడిన పీతమాంస భక్షణద్వారా అనారోగ్యంతో మరణించినట్లు వైట్‌హౌస్ నుంచి అధికార ప్రకటన వెలువడింది. కాని 1923 జూలై ఆఖరులో అతని నిరంతర ధూమపానం, రాత్రంతా [illegible] 58వ ఏట [illegible]. వైట్‌హౌస్‌లోని తూర్పుగదికి 29వ అధ్యక్షుని శరీరము ప్రభుత్వ మర్యాదలతో చేర్చబడింది.

పండు వెంకటేశ్వరరెడ్డి